
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కోటగిరి వేంకట పాపారావు జ్ఞాపకార్థం ఆయన భార్య రత్నకుమారి (భువనగిరి) మంగళవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
42.0° / 25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	39.5	26.5
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

చక్రస్నాన వైభవం

- గోవిందనామ స్మరణతో మార్మోగిన వాడపల్లి వెంకన్న ఆలయం



గౌతమి గోదావరిలో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

ఆత్రేయపురం: కల్యాణోత్సవాల్లో భాగంగా కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి చక్రస్నాన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం భక్తులు పాల్గొని స్వామివారి చక్రస్నాన కార్యక్రమాన్ని తిలకించారు. ఉదయం స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి, బాలభోగం, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు చోర సంవాదం జరిపించారు. స్వామి వారిని పల్లకీపై అధిష్ఠింపజేసి బాణసంచా కాల్పుల నడుమ బ్యాండ్ మేళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించి గౌతమీ గోదావరి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గోదావరి సమీపంలో ఏర్పాటు చేసిన పూరిపాకలో స్వామివారిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారిని గౌతమీ గోదావరి వద్ద వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా చక్రస్నానం కార్యక్రమం నిర్వహించారు. దేవదయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. బుధవారం స్వామివారి శ్రీపుష్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ వివరించారు.

ఘనంగా సీతారాముల శ్రీచక్రస్నానం



సీతారాముల విగ్రహాలకు, శ్రీచక్రానికి పుణ్యస్నానం చేయిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై నిర్వహిస్తున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజైన మంగళవారం పంపా నదిలో సీతారాముల శ్రీచక్రస్నాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వెంటరాగా పల్లకీపై నవదంపతులు సీతారాములను పంపా తీరానికి ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ వేదికపై ఏర్పాటు చేసిన రెండు సింహాసనాలపై సీతారాములను, సత్యదేవుడు, అమ్మవారిని వేంచేయించి పూజలు చేశారు. అనంతరం సీతారాములకు, శ్రీచక్రానికి పండితులు అవభృథ స్నానం నిర్వహించారు. ఆ తరువాత సీతారాముల విగ్రహాలను శ్రీచక్రాన్ని వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా పంపా నదికి తీసుకుని వెళ్లి, శ్రీచక్రస్నానం నిర్వహించారు.

వ్యయాందోళనలు

- ఇంధనం పోస్తేనే ప్రచార రథం ముందుకు
- టీడీపీ, జనసేన అభ్యర్థులకు తిప్పలు
- సీటు తెచ్చుకోవడం దగ్గర నుంచి ప్రతిదానికీ సొమ్ములే
- రామచంద్రపురం, పి.గన్నవరం, రాజోలులో ఇబ్బందికర స్థితి
- భారీగా వదులుతున్న చేతి చమురు

సాక్షి అమలాపురం: పెట్రోల్‌కు రూ.150 నుంచి రూ.రెండు వందల టోకెన్... టిఫిన్, భోజనం. ప్రచారం ముగిసిన తరువాత రూ.500 క్యాష్... క్వార్టర్ మద్యం. ప్రచారం భారీగా కనిపించాలంటే వచ్చిన వారిలో కొంతమందికైనా అభ్యర్థులు ఈ మాత్రం ఖర్చు చేయాల్సిందే. రామచంద్రపురం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలలో ప్రచారం మొత్తం డబ్బు మీదనే నడుస్తోంది. కాసులు ఇస్తేనే కాని కదలమని క్యాడర్ తెగేసి చెబుతుండడంతో అభ్యర్థులకు చేతి చమురు భారీగానే వదులుతోంది.

ఎన్నికల సమయంలో అభ్యర్థులకు అంచనాలకు మించి ఖర్చవ్వడం సాధారణం. కానీ జిల్లాలో ఈ మూడు నియోజకవర్గాలలో టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులకు మాత్రం సీటు సాధించడం దగ్గర నుంచి ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం వరకు ఖర్చు తడిసిమోపెడు అవుతోంది. ఇక్కడ అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. గత నెల రోజుల నుంచి ఇంటింటా, గ్రామాల వారీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. దీంతో ఇక్కడ మిత్రపక్షాల అభ్యర్థుల తమ ప్రచారంలో ఊపు తీసుకురావడం కోసం వివిధ ప్రాంతాల నుంచి క్యాడర్‌ను తరలించాల్సి వస్తోంది.



రోజువారీ అద్దె కార్యకర్తలే దిక్కు

రామచంద్రపురంలో టీడీపీ తరఫున వాసంశెట్టి సుభాష్, పి.గన్నవరం, రాజోలు నుంచి జనసేన తరఫున గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్‌లు బరిలో ఉన్న విషయం తెలిసిందే. అప్పటి వరకు స్థానికంగా అటు టీడీపీ, ఇటు జనసేన జెండాలు మోసిన ఇన్‌చార్జిలు, టిక్కెట్ ఆశించినవారిని కాదని వీరు అప్పటికప్పుడు నియోజకవర్గాలకు వచ్చి రెడీమేడ్‌గా టిక్కెట్‌లు తెచ్చుకున్నారు. ఇందుకే ఆయా పార్టీలకు చెందిన అధిష్ఠానాలకు వీరు భారీ మొత్తంలో పార్టీ ఫండ్ రూపంలో సమర్పించుకున్నారని సొంత పార్టీ క్యాడర్ చెబుతోంది. టీడీపీ అభ్యర్థి సుభాష్ స్థానికేతరుడు కావడం, జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్ రెండేళ్ల క్రితం పార్టీలో చేరినా కేంద్ర కార్యాలయంలో తప్ప స్థానికంగా లేరు. గిడ్డి సత్యనారాయణ ఇటీవల రాజకీయాలలోకి వచ్చారు. వీరందరికీ స్థానికంగా పరిచయాలు తక్కువ. దీంతో క్యాడర్‌ను ప్రసన్న చేసుకోవడం కోసం అష్టకష్టాలు పడుతున్నారు. దీనికితోడు టీడీపీ, జనసేన సీట్లు ఆశించి ఏళ్ల పాటు పార్టీ జెండాలు మోసినవారు... ఎన్నికలలో లక్షలు ఖర్చు పెట్టిన వారు తీవ్ర అసంతృప్తితో ఉండడం, ప్రచారానికి దూరంగా ఉండడం, కొందరు పార్టీని వీడి వెళుతుండడంతో ప్రచారానికి వచ్చేవారు లేకుండా పోతున్నారు. దీంతో రోజువారీ అద్దె కార్యకర్తలపై వీరు అధికంగా ఆధారపడుతున్నారు.

గన్నవరంలో అంతా డబ్బు మయం

పి.గన్నవరంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. **గత ఎన్నికలలో** ఇక్కడ టీడీపీ నాయకులు తమ **పార్టీ అభ్యర్థిని** పక్కనబెట్టి పార్టీ ఫండ్‌ను ఇష్టానుసారం **ఖర్చు చేశారు**. కొంతమంది నాయకులు **పార్టీ ఫండ్ రూ**.రెండు కోట్లు పక్కదారి పట్టించారని **అప్పట్లో** పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. **ఆ భయం** ఇక్కడ జనసేన అభ్యర్థి గిడ్డిని ఒకపక్క కలవరపెడుతూనే ఉండగా, మరోవైపు సొంత పార్టీలో కొంతమంది నాయకులు సైతం ఇదే పంథాలో ఉండడంతో ఆయనను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. 'మా అభ్యర్థులు డబ్బును నమ్ముకుని రాజకీయాలు చేస్తున్నారు. ఒక విధంగా వారు పులి మీద స్వారీ చేస్తున్నారు. ఖర్చుకు భయపడి వెనకడుగు వేశారా? ఇక అంతే' అని ఆ పార్టీకి చెందిన నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

టీడీపీలో మరీనూ..

జనసేన అభ్యర్థులకు కొంతవరకు పవన్ అభిమానులు కలిసివచ్చినా టీడీపీ నుంచి నాయకులను తీసుకురావడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ప్రధాన నాయకులే సొమ్ము ఇస్తేకాని కదిలేది లేదని చెప్పడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ప్రచారానికి కార్యకర్తలను తరలించే విషయంలో నాయకులు జట్టు మేస్త్రీల అవతారం ఎత్తడం చూసి అభ్యర్థులు కంగుతింటున్నారు. పదిమందిని తీసుకువచ్చి ఇరవై, ముప్పయి మందిగా లెక్కలు చూపుతున్నారని అభ్యర్థుల ఆర్థిక వ్యవహారాలు చూసే నాయకులు గగ్గోలు పెడుతున్నారు. అద్దె కార్యకర్తలకు రోజువారీ చెల్లిస్తే ద్వితీయ శ్రేణి నాయకులకు ఒకేసారి పెద్ద మొత్తం చెల్లించాల్సి వస్తోంది. లీడర్ స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకు ఇస్తున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా మార్కులు సాధించడం అభినందనీయం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: పేదింటి పిల్లలు ఉత్తమ ప్రతిభా పాటవాలను కనబరిచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ కార్పొరేట్‌కు దీటుగా మార్కులు సాధించడం అభినందనీయమని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు, మార్పుల మూలంగా కార్పొరేట్ దీటుగా మార్కులు సాధించారన్నారు. అల్లవరం మండలం ఓడలరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన



జిల్లా ప్రథమ స్థానం సాధించిన ఈషిత, తల్లిదండ్రులను సత్కరిస్తున్న కలెక్టర్ శుక్లా, డీఆర్వో వెంకటేశ్వర్లు తదితరులు

పినపోతు ఈషిత(595 మార్కులు), కొత్తపేట మండలం అవిడి చప్పిడివారిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన నూకపెయ్యి నవనీత్(593), ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ఆకుల బిందు శరణ్య, (592) మండపేట మండలం ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మల్లేశ్వరపు శిరీష (591), మామిడికుదురు మండలం మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బొంతు హర్షిత (590), మల్కిపురం మండలం కేసనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అడబాల సూర్య నాగదేవి కీర్తన (590), మామిడికుదురు మండలం పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గిడుగు శ్రీరామ దుర్గ (590, అమలాపురం స్కూలుకు చెందిన ఎం.మౌర్య (561) మార్కులు సాధించారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ విభాగం డివిజనల్ ఇంజినీర్ సుబ్బరాజు, వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు పార్టీలు సహకరించాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా కోరారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణలో పురోగతి అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అమలాపురం పార్లమెంట్ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల పర్వం ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని, షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో రాజకీయ పార్టీల సహకారం జిల్లా యంత్రాంగానికి అందించాలని సూచించారు. ఈ నెల 25 తేదీన నామినేషన్ పర్వం ముగుస్తుందని అభ్యర్థులు చెక్‌లిస్ట్ ప్రకారం ఇంకా సమర్పించవలసిన పత్రాలను అదే



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

రోజు మధ్యాహ్నం మూడు గంటలలోపు తప్పనిసరిగా సమర్పించాలని లేనిపక్షంలో అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించే అవకాశం ఉందని తెలిపారు. 26న నామినేషన్ల పరిశీలన 29న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. మే 13న పోలింగ్‌కు పటిష్టమైన ఏర్పాట్లను చేస్తున్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు దూరి రాజేష్, వడ్డీ నాగేశ్వరరావు కాశీ లక్ష్మీభవాని, ప్రవీణ్‌కుమార్ కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తెరతీసిన ఉల్లంఘన!

- జిల్లా ఎంసీఎంసీ అనుమతులు లేకుండానే పబ్లిసిటీ
- ఎల్‌ఈడీ స్క్రీన్లతో టీడీపీ, జనసేన ప్రచారాలు
- వాహనాలను సీజ్ చేయాలని అధికారుల ఆదేశాలు

అమలాపురం టౌన్: జిల్లాలో ఓ పక్క నామినేషన్ల దాఖలు ప్రక్రియ జోరుగా జరుగుతుంటే మరోపక్క ఎన్నికల ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ముఖ్యంగా టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాలకు ఉపయోగించే ఎల్‌ఈడీ స్క్రీన్లతో వీడియో వాహనాలకు నిర్దేశిత జిల్లా అధికారి నుంచి అనుమతులు తీసుకోవడం లేదు. ఫలితంగా ఆ వీడియో వాహనాలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్నాయి. సాధారణ ప్రచార వాహనాలకు ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అనుమతులు ఇస్తారు. అయితే ఎల్‌ఈడీ స్క్రీన్లతో నడిచే డిజిటల్ వీడియో వాహనాల పర్యవేక్షణ మాత్రం జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) పరిధిలోనే ఉంటుంది. ఈ కమిటీ జిల్లా కన్వీనర్ నుంచి ఈ తరహా ప్రచార వాహనాలకు విధిగా అనుమతులు తీసుకోవాలి. అయితే జిల్లాలోని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులు సాధారణ ప్రచార వాహనాలతో పాటు ఎల్‌ఈడీ స్క్రీన్ వీడియో వాహనాలకు అనుమతులు తీసేసుకుంటున్నారు. వాస్తవానికి ఈ వీడియో వాహనాలకు రిటర్నింగ్ అధికారులు అనుమతులు చెల్లవు. జిల్లా ఎంసీఎంసీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఈ వాహనాల ఉనికిపై ఆరా తీసింది. అమలాపురం, పి.గన్నవరం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఎల్‌ఈడీ తెర వీడియో వాహనాలు ప్రచారాలకు తిరుగుతున్నట్లు గమనించింది. జిల్లాలో ఎన్నికల నిర్వహణాధికారులకు జిల్లా ఎంసీఎంసీ కన్వీనర్ అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) బృందాలు ఈ తరహా ఎల్‌ఈడీ వాహనాలను గుర్తించి అనుమతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది సుప్రీంకోర్టు ఆదేశాల ఉల్లంఘన కిందకు కూడా వస్తుందని స్పష్టం చేశారు. జిల్లా ఎంసీఎంసీ కన్వీనర్ నుంచి అమలాపురం మున్సిపల్ కమిషనర్, ఎంసీసీ నోడల్ ఆఫీసర్ ఎస్.మనోహర్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో మనోహర్ తన పరిధిలో ఉన్న ఎంసీసీ బృందాలను తక్షణమే అనుమతులు లేని ఎల్‌ఈడీ తెర వీడియో ప్రచార వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని సూచించారు. అమలాపురం పట్టణ పరిధిలో వీడియో వాహనాలతో ప్రచారం చేస్తే తక్షణమే సీజ్ చేస్తామని కమిషనర్ మనోహర్ హెచ్చరించారు.

చర్యలు తీసుకోవాలని పలువురి వినతి

టీడీపీకి చెందిన ఎల్‌ఈడీ వీడియో ప్రచార వాహనం ఒకటి అమలాపురం పట్టణం మీదుగా సోమవారం వెళ్లి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసింది. మరో టీడీపీ ఎల్‌ఈడీ వాహనాన్ని పి.గన్నవరం మండలం ముంగండ గ్రామంలో ఓ కూడలి వద్ద నిలిపి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ పలు అనుకూల దృశ్యాలను ప్రదర్శించారు. రాజోలు మండలం తాటిపాకలో ఓ భవన యజమాని అనుమతులు లేకుండా ఆ భవనంపై టీడీపీ, జనసేన అభ్యర్థుల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఆ భవన యజమాని అభ్యంతరం చెప్పారు. అంతటితో ఆగకుండా ఎన్నికల సంఘం, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌వోలకు భవన యజమాని కోర్టు నోటీసు కూడా ఇచ్చారు. ఇలా జిల్లాలో పలుచోట్ల ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న టీడీపీ, జనసేన అభ్యర్థులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారైన జిల్లా కలెక్టర్‌కు పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



పి.గన్నవరం మండలం ముంగండలో ఎల్‌ఈడీ తెరతో ప్రచారం చేస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వాహనం

ఆర్యవైశ్యులకు బాబు అన్యాయమే చేశారు

- ఈ ఎన్నికల్లో ఆయన్ను నమ్మి ఓట్లు వేస్తే గోతిలో పడ్డట్టే
- సంఘ ఆత్మీయ సమావేశంలో శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం

మండపేట: ఆర్యవైశ్యులకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తీరని ద్రోహం చేశారని, ఆయన్ను నమ్మి టీడీపీకి ఓట్లు వేస్తే మన గొయ్యిని మనమే తవ్వుకున్నట్టు అవుతుందని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. మండపేటలో మంగళవారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. శ్రీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మంటపంలో సంఘ అధ్యక్షుడు బోనగిరి రాజా అధ్యక్షతన జరిగిన సమావేశానికి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రెడ్డి రాజబాబు, వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు, తనకు మూడు దశాబ్దాల సాన్నిహిత్యం ఉందన్నారు. ఆయన కుటుంబంతో ఎప్పటి నుంచో తనకు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఆర్యవైశ్యులు ఎక్కువగా వ్యాపార రంగాల్లో స్థిరపడి ఉంటారని ఆయా సందర్భాల్లో వ్యాపారులపై అధికారులు జులుం ప్రదర్శించినప్పుడు తనకు మొదట గుర్తుకు వచ్చేది ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులేనని చెప్పారు. ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ తోట అందించిన సహాయ సహకారాలు ఎప్పటికీ గుర్తుండి పోతాయన్నారు. అటువంటి మంచి నాయకుణ్ని పట్టుకొని ఇటీవల జరిగిన ఆర్యవైశ్య సమావేశంలో ఓ చిన్న కుర్రాడు విమర్శిస్తే తనకు బాధ కలిగిందన్నారు. మండపేట ఆర్యవైశ్యులు మంచి మనసున్న వారని అటువంటి వ్యక్తుల మధ్య విభేదాలు సృష్టించాలని చేస్తున్న ప్రయత్నాలకు మోస పోవద్దన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం

సీఎం జగన్ ఆర్యవైశ్యులను గౌరవించారు

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆర్యవైశ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎందుకు ఓటు వేయాలి అనే అంశాలను ఆయన వివరించారు. ఆర్యవైశ్యులకు మూడు కార్పొరేషన్ పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఆర్యవైశ్యుల్లో ముగ్గురికి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చిన చరిత్ర ఆయనది అన్నారు. ఆర్యవైశ్యులకు మేలు చేకూరే మూడు జీవోలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలుపరిచారని తెలియజేశారు. పొట్టి శ్రీరాములు జయంతి నాడే ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం అని ప్రకటించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని తెలియజేశారు. చింతామణి నాటకంలో ఓ పాత్ర ఆర్యవైశ్యులను చులకన చేస్తూ ఉందని ఆ నాటకాన్ని రద్దు చేయాలని బాబును కోరితే ఆయన మనసు అంగీకరించలేదన్నారు. సీఎం జగన్ చింతామణి నాటక ప్రదర్శనను ఆంధ్ర రాష్ట్రంలో నిషేధిస్తూ జీవో అమలు చేసి ఆర్యవైశ్యుల గౌరవాన్ని నిలబెట్టారని కొనియాడారు. సీఎం జగన్ దేవదాయ శాఖ నుంచి ఆర్యవైశ్య సత్రాలు ఆలయాలను తప్పించి జీవో అమలు పరిచారన్నారు. చంద్రబాబు 15 ఏళ్లు సీఎంగా ఉండి ఆర్యవైశ్యులకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. ఆర్యవైశ్యుల్లో ఉన్న పేదలను గుర్తించి వారి సంక్షేమం కోసం సీఎం జగన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన సీఎం జగన్మోహన్ రెడ్డికే మన మద్దతు తెలియజేసి మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఘనంగా సత్కరించారు. కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పెద్ది రత్నాజీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కాంతేటి కాశీ, ఆర్యవైశ్య నాయకులు సంకా బాబ్జి, బోనగిరి రాజా, సంకా కుమార్, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ కాళ్ళకూరి రామ నాగేశ్వరరావు, బోనగిరి బాబ్జి, గ్రంధి నమశ్శివాయ, గ్రంధి శేషగిరి, గ్రంధి సూరిబాబు, బోడా వీర్రాజు, ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాపాక నామినేషన్

- చింతలమోరి నుంచి అమలాపురం వరకు భారీ ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- జిల్లాలో 26 మంది నామినేషన్‌లు

సాక్షి అమలాపురం: అమలాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రాపాక వర ప్రసాదరావు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. స్వగ్రామం చింతలమోరి నుంచి అమలాపురంలోని కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వచ్చిన ఆయన నామినేషన్ పత్రాలను పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందజేశారు. రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రాపాక అందజేశారు. తొలుత ఆయన మలికిపురం మండలం చింతలమోరి నుంచి నామినేషన్‌కు బయలుదేరారు. వెంట వందలాది మంది కార్యకర్తలు, పార్టీ నాయకులు, రాపాక అభిమానులు ఆయన వెంట ర్యాలీగా బయలుదేరారు. మోటారు సైకిళ్లు, కార్లతో ఈ ర్యాలీ సాగింది. చింతలమోరి నుంచి మలికిపురం, రాజోలు, తాటిపాక, బోడసుకుర్రు, పేరూరు ఎత్తురోడ్డు, అమలాపురం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. దారిపొడవునా రాపాకకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలు, పూల దండలతో ముంచెత్తారు. జై జగన్, జై రాపాక నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. రాజోలుతోపాటు పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున రాపాక నామినేషన్‌కు వచ్చి తన మద్దతు తెలిపారు.

26 మంది నామినేషన్లు

జిల్లాలో మంగళవారం వివిధ పార్టీలు, స్వతంత్రులుగా 28 మంది అభ్యర్థులు 36 నామినేషన్ పత్రాలను సమర్పించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు

వర ప్రసాదరావుతోపాటు మరో ఐదుగురు అభ్యర్థులు 8 నామి నేషన్లు దాఖలు చేశారని జిల్లా కలెక్టర్, పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ తరఫున భూసిం రమణమ్మ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎడ్ల రాజేష్, స్వతంత్ర అభ్యర్థిగా ఇసుకపట్ల ఇమ్మానియేల్ కుమార్, బహుజన్ సమాజ్ పార్టీ తరఫున యాళ్ల దొరబాబు, స్వతంత్ర అభ్యర్థిగా గుడే వెంకటేశ్వర్లు నామినేషన్ పత్రాలను సమర్పించారు

రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గానికి బీఎస్పీ తరఫున మాత రాణి, ఇదే పార్టీ తరఫున మరో అభ్యర్థి మాత మంగాదేవి, భారత చైతన్య యువజన పార్టీ తరఫున బర్ల వెంకట శ్రీనివాసరావు, ఇదే పార్టీ తరఫున మరో అభ్యర్థి బర్ల పార్వతి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున కోట వరలక్ష్మి, స్వతంత్ర అభ్యర్థిగా ప్రవీణ్ కుమార్ లంకలు నామినేషన్లు దాఖలు చేశారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్వతంత్ర అభ్యర్థిగా దంగేటి మహేష్‌బాబు, తెలుగుదేశం అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిరాజు), ఇదే పార్టీ తరఫున దాట్ల పృథ్వీరాజ్, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ తరఫున గొల్లపల్లి శ్రీధర్, గొల్లపల్లి సూర్యారావులు, జనసేన తరఫున దేవ వరప్రసాద్, స్వతంత్ర అభ్యర్థిగా మత్తి జయప్రకాష్‌లు నామినేషన్‌లు వేశారు.

కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఎస్పీ తరఫున కాండ్రు వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా రాయుడు రాజు, వైఎస్సార్ సీపీ తరఫున చిర్ల జగ్గిరెడ్డి, చిర్ల లావణ్య నామినేషన్లు వేశారు. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున గిడ్డి సత్యనారాయణ, జై భీమారావు భారత్ పార్టీ తరఫున దుక్కిపాటి విజయచంద్ర, జై భారత్ నేషనల్ పార్టీ తరఫున కోట బాలకృష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా ఇసుకపట్ల ఇమ్మానియేల్ కుమార్‌లు నామినేషన్లు సమర్పించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున అయితాబత్తుల సుభాషిని, ఇదే పార్టీ తరఫున అయితాబత్తుల కుమార్‌సింగ్, బీఎస్పీ నుంచి పాలమూరు మోహన్‌బాబు, స్వతంత్ర అభ్యర్థిగా చుట్టుగూళ్ల వీర వెంకట సత్యనారాయణ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున బి.ఐశ్వర్య నామినేషన్లు వేశారు.

క్లుప్తంగా

చెస్ స్టేట్ చాంపియన్‌గా సాత్విక్



చెస్ స్టేట్ చాంపియన్ షిప్‌ను అందుకుంటున్న క్రీడాకారుడు సాత్విక్

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన చెస్ క్రీడాకారుడు ద్రాక్షారపు స్వాత్విక్ స్టేట్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. విజయవాడ పోరంకిలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకూ జరిగిన చెస్ అండర్–17 స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో సాత్విక్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి ఈ చాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్నాడు. అమలాపురంలోని విక్టరీ అకాడమీ విద్యార్థి అయిన సాత్విక్ చిన్నతనం నుంచి చెస్ క్రీడలో రాణిస్తూ ఎప్పటికప్పుడు ప్రతిభ కనబరుస్తున్నాడని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. సాత్విక్ చెస్ ప్రతిభ జిల్లాకే గర్వ కారణమని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెలలో చండీఘర్‌లో జరగనున్న ఆలిండియా అండర్–17 చెస్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో సాత్విక్ మన రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడని సురేష్ తెలిపారు. ఈ నెల 17న అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్–17 చెస్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించిన సాత్విక్ విజయవాడ పోరంకిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రవ్యాప్తంగా 150 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో సాత్విక్ ప్రథమస్థానంలో నిలిచాడు.

నదిలో జారిపడి విద్యార్థి మృతి


యంద్రు మురళీకృష్ణ (ఫైల్)

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నదిలో కపిలేశ్వరపురం వద్ద ప్రమాదవశాత్తూ జారిపడి మండపేటకు చెందిన యువకుడు మృతిచెందాడు. అంగర ఎస్సై అందె పరదేశి తెలిపిన వివరాల ప్రకారం... మండపేటకు చెందిన యంద్రు మురళీకృష్ణ (20), మరో నలుగురు కపిలేశ్వరపురం వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. మంగళవారం జరిగిన ఘటనలో మురళీకృష్ణ మృతిచెందాడు. మృతుడు మండపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. యువకుడి తండ్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తికి ఆరునెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ ఐదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్‌షరీన్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విజయనగరం జిల్లా గుర్ల మండలం గూడెం గ్రామానికి చెందిన కనకం దామోదర్‌రావు గత ఏడాది తూరంగి ప్రాంతంలో ఒక ఇంట్లో సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. సెల్‌ఫోన్ యజమాని దుర్గాడ సురేష్ ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో దామోదర్‌రావుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పాఠాలకు ఆటవిడుపు!

- బడులకు నేటి నుంచి వేసవి సెలవులు
- ఆనందంగా ఇంటిదారి పట్టిన విద్యార్థులు
- జూన్ 12న మళ్లీ ప్రారంభం


రాయవరంలో సెలవులు ఇచ్చిన ఆనందంతో ఉత్సాహంగా ఇంటి బాట పట్టిన విద్యార్థులు


లైబ్రరీ పుస్తకాలతో మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం విద్యార్థులు

రాయవరం: ఏడాది పాటు పుస్తకాలతో..తరగతి గదుల్లో గడిపిన చిన్నారులకు వేసవి సెలవుల రూపంలో ఆటవిడుపు దొరికింది. అటు పుస్తకాలతో కుస్తీలు..ఇటు ఎండ వేడిమి, ఉక్కపోతల నుంచి వీరికి ఉపశమనం లభించింది. చదువుతో పాఠశాలల్లో, హోమ్ వర్క్‌లతో ఇంట్లో బిజీగా ఉండే పిల్లలకు ఒక్కసారిగా తీరిక సమయం దొరికింది. ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ వేసవి సెలవులు ప్రకటించింది. పాఠశాల విడిచిన అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా ఇంటి బాట పట్టారు. సెలవుల్లో ఏం చేయాలో..ఎక్కడెక్కడికి వెళ్లాలో అంచనాలు వేసుకుంటూ, స్నేహితులతో ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ ముందుకు సాగారు.

ఆటల్లో మునిగి తేలనున్న విద్యార్థులు..

ముగిసిన విద్యా సంవత్సరంలో పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇక ఆటపాటల్లో మునిగి తేలనున్నారు. మైదానాలు, పొలంగట్లపైన ఆటలు, నదులు, చెరువులు, కాలువల్లో ఈతలు కొట్టడంలో తలమునకలు కానున్నారు. రోజంతా ఇంచుమించుగా ఉత్సాహంతో గడపనున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ సామాన్లు సర్దుకొని స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్టాండులకు బయల్దేరారు.

జిల్లాలో

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కింద 2,036 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 2.02 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ నేటి నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు పట్టరాని సంతోషంతో పాఠశాల వద్ద విద్యార్థులు కేరింతలు కొట్టుకుంటూ టాటా..బైబై అనుకుంటూ ఇంటిదారి పట్టడం కన్పించింది. పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పలు పాఠశాలల్లో చివరి పనిదినం రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీటు, హాట్‌తో పాటు చల్లని పానీయాలు అందజేశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలిచ్చారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు వేసవి సెలవుల్లో చదువుకునేందుకు విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు సెలవులు ఇచ్చినా ఉపాధ్యాయులు మాత్రం మార్కులు ఆన్‌లైన్ చేయడం, మనబడి నాడు–నేడు పనులు, ప్రమోషన్ జాబితాల తయారీలో నిమగ్నమయ్యారు.

> **తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు**
>
> వేసవి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సైతం నిబంధనలను కచ్చితంగా పాటించాలి. తరగతుల నిర్వహణపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఆయా పాఠశాలల అనుమతుల రద్దుకు చర్యలు చేపడతాం. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశాం.
>
> – ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

సైనిక సంక్షేమానికి ప్రత్యేక వెబ్‌సైట్

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాజీ సైనికులు సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందించామని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి మజ్జి కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కల్పించే వివిధ పథకాలను ఇక నుంచి వారి నివాస ప్రాంతం నుంచే దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఏపీ.సైనిక్.కామ్ అనే వెబ్‌సైట్‌లో అప్లికేషన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వాలు సైనిక సంక్షేమ శాఖ ద్వారా అందించే ప్రయోజనాలు, గ్రాంట్లు పొందడానికి సర్వీస్ పుస్తకం, ఐడెంటిటీ కార్డు, ఇతర సర్టిఫికెట్లు అప్లోడ్ చేయడం వల్ల దరఖాస్తు చేసిన ప్రతీసారి నకలు కాపీలను జత చేయాల్సిన అవసరం ఉండదని వివరించారు. జిల్లా సైనిక కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునే వ్యక్తులు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించవచ్చన్నారు. అభ్యర్థుల పెన్షన్ వివరాలు, పీపీఓ, ఆధార్, పాన్, ఫ్యామిలీ, ఈసీహెచ్ఎస్, కేంటీన్ వివరాలు కావాల్సి ఉంటుందన్నారు. అప్‌లోడ్ చేయాల్సిన డాక్యుమెంట్లు సర్వీస్‌బుక్, ఆధార్, మాజీ సైనికుని లేదా మాజీ సైనిక వితంతువు ఫొటోగ్రాఫ్, బ్యాంక్ పాస్‌బుక్ లేదా కాన్సిల్ చెక్స్, ఐడెంటిటీ కార్డు, పీపీవో తదితరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని కృష్ణారావు వివరించారు.

వివాహిత దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణం


మణికుమారి (ఫైల్)

అల్లవరం: మండలంలోని రెల్లుగడ్డ గ్రామంలో వివాహిత బొంతు మణికుమారి (35) మంగళవారం మధ్యాహ్నం దారుణ హత్యకు గురైంది. ఇదే గ్రామానికి చెందిన కొంబత్తుల నవీన్‌కుమార్‌తో వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెల్లుగడ్డలో పనీపాటా లేకుండా జులాయిగా తిరిగే నవీన్‌తో మణికుమారికి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. మణికుమారి భర్త రామకృష్ణ జీవనోపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. అయితే దుబాయ్‌లో ఉంటున్న భర్త వద్దకు వెళ్లేందుకు మణికుమారి అన్ని ఏర్పాట్లు చేసుకుని వారం రోజుల్లో ప్రయాణానికి సిద్ధమవుతోంది. అయితే మణికుమారి గల్ఫ్ వెళ్లడం నవీన్‌కు ఇష్టం లేదు. ఎలాగైనా ఆపాలనుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మణికుమారి వద్దకు వచ్చాడు. ఇదే ఇంటిలోని పక్క పోర్షన్‌లో ఉంటున్న బొంతు గీతాంజలి కుమారుడు బొంతు మనోజ్, మణికుమారి వద్దకు నవీన్ రావడం చూసేశాడు. ఎలాగైనా మనోజ్ కంట పడకుండా ఉండేందుకు మంకీ క్యాప్ ధరించి నవీన్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి దాక్కున్నాడు. ఇది గమనించిన మనోజ్ బయట బాత్‌రూమ్ గడియ పెట్టేశాడు. బాత్‌రూమ్‌లో బందీగా ఉన్న నవీన్‌ను ఇక్కడ నుంచి పంపించేందుకు మణికుమారి గడియ తీసింది. గడియ తీయగానే నవీన్ బాత్‌రూమ్ నుంచి వంటగదిలోకి చొరబడ్డాడు. మంకీ క్యాంప్ ధరించిన వ్యక్తి ఎవరో తెలుసుకునేందుకు మనోజ్ మంకీ క్యాంప్‌ని తీసే ప్రయత్నం చేశాడు. దీంతో నవీన్ ఆగ్రహానికి గురై వంట గదిలో షేడుపై ఉన్న కత్తిని తీసుకుని మనోజ్‌పై దాడి చేయబోయాడు. మనోజ్ తప్పించుకుని పారిపోయాడు. ఇంతలో మణికుమారి తల, నడుము భాగాల్లో విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన మణికుమారి అక్కడికక్కడే మృతి చెందింది. హత్య చేసిన నవీన్ అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వీరబాబు ఎస్సై హరీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, మనోజ్ నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్, కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్‌ని రప్పించి దర్యాప్తు చేపట్టారు. ఇదే ఇంట్లో ఏడాదిన్నర క్రితం బొంతు గీతాంజలికి చెందిన బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసులో నవీన్‌పై కేసు నమోదు అయింది. ఈ ఘటనపై ఎస్సై హరీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చోరీ కేసులో నాలుగు నెలల జైలు

ధవళేశ్వరం: చోరీ కేసులో ముద్దాయికి నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్‌మోహన్ తెలిపారు. 2023 డిసెంబర్ 24న ధవళేశ్వరం కాటన్‌పేటలో చోరీకి పాల్పడిన తణుకుకు చెందిన చిప్పాడ కేదారేశ్వరరావును పోలీసులు అరెస్ట్ చేసి సొత్తును రికవరీ చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం ముద్దాయికి నాలుగు నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి సి.రమ్య తీర్పు ఇచ్చారన్నారు. ఏపీపీ కె.లక్ష్మీదేవి వాదనలు వినిపించారు.

టీచర్ ఇంట్లో దొంగతనం

- రూ.18 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- కేసు నమోదు

యానాం: పట్టణ పరిధిలో కామిశెట్టివారివీధిలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కామిశెట్టివారి వీధిలో నివాసం ఉంటున్న స్థానిక కమలానెహ్రూ ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న కేవీఎన్‌లక్ష్మీ నివాసంలో దొంగలు పడి ఇంట్లో ఉన్న రూ.18 లక్షల విలువచేసే బంగారు గొలుసులు తదితరమైన వాటిని తస్కరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుల వివరాలను తీసుకుని విచారిస్తున్నారు. బాధితురాలి కుమారుడికి ఇటీవలే వివాహం కాగా అమెరికాలో ఉంటున్నారు.

చేబ్రోలులో ఎడ్ల పరుగు పోటీలు


ఎడ్లపందేలు నిర్వహిస్తున్న దృశ్యం


సీనియర్ విభాగంలో గెలుపొందిన కోరా వీర వెంకట సత్యవేణికి బహుమతి అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగలోవరాజు, అరిగెల రామయ్య దొర

గొల్లప్రోలు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారామల కల్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలను నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలకు గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు పులవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్య దొర బహుమతులను అందజేశారు. సీనియర్ విభాగంలో 11 జతలు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ బహుమతులు గుమ్మిలేరుకు చెందిన కోరా వీర వెంకట సత్యవేణి, జూనియర్స్ విభాగంలో 21 జతలు పాల్గొనగా ప్రథమ బహుమతి గుమ్మిలేరుకు చెందిన కోరా వీర వెంకట సత్యవేణి, ద్వితీయ బహుమతి కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ సాధించారు. న్యాయ నిర్ణేతలుగా చేకూరి రామకృష్ణ, కంటె ఫణికుమార్ వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పడాల ప్రభాకర్, ఇసరపు రామకృష్ణ, నూజివీడు సూర్య, ఆకుల శ్రీను, కడిమిశెట్టి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

- గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న నిందితుడు
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ కిషోర్‌కుమార్


కేసు వివరాలను విలేకరులకు వెల్లడిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

అనపర్తి: మండలంలోని పీరారామచంద్రపురంలో గల ఓ హార్డ్‌వేర్ షాపులో ఒంటరిగా ఉన్న మహిళపై ఐరన్ రాడ్డుతో దాడి చేసి ఆమె మెడలో మంగళసూత్రాల తాడును అపహరించుకుపోయిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ వెల్లడించారు. హార్డ్‌వేర్ సామాన్లు కావాలంటూ ఈ నెల 2న పీరారామచంద్రపురంలో గల హార్డ్‌వేర్ షాపునకు వచ్చిన నిందితుడు తన వెంట తెచ్చుకున్న ఐరన్ రాడ్డుతో షాపులో ఉన్న మహిళ తలపై బలంగా కొట్టి ఆమె మెడలో బంగారు పుస్తెలతాడును దొంగిలించి బైక్‌పై ఉడాయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో, డీఎస్పీ ఆధ్వర్యంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది బృందాలుగా ఏర్పడి జిల్లా ఐటీ కోర్ టీం, క్రైమ్ పార్టీ సిబ్బంది సహకారంతో విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తులో నిందితుడు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నాడన్న సమాచారం తెలియడంతో అతడిపై నిఘా ఉంచారు. ఇదిలావుండగా సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఆపి అతడి వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్ సిబ్బంది తనిఖీ చేయగా అందులో సుమారు 21 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతడిని విచారించగా అతడు కడియం మండలం జేగురుపాడుకు చెందిన తానంగి క్రాంతికుమార్‌గా గుర్తించారు. పోలీసుల విచారణలో పీరారామచంద్రపురంలో జరిగిన చైన్ స్నాచింగ్‌కు క్రాంతికుమార్ పాల్పడినట్టు గుర్తించారు. గతంలో రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ చేసి జైలుశిక్ష అనుభవించినట్లు, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఏడిద, పోలవరంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడడంతోపాటు అప్పుడప్పుడూ పాడేరు వెళ్లి గంజాయి తెచ్చుకుని రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. గతంలో గల్ఫ్ దేశం బెహ్రాయిన్ వెళ్లిన క్రాంతికుమార్ తిరిగి బెహ్రాయిన్ వెళ్లేందుకు నగదు అవసరం కావడంతో నేరాలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి అనపర్తి మండలం పీరారామచంద్రపురం, పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ చేసిన 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 21 కిలోల గంజాయి, బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరు పరచి జ్యుడీషియల్ కస్టడీకి పంపనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ పి.శివగణేష్, ఎస్సై కె.రామారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రూ.2.58 కోట్ల బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం


బంగారు, వెండి వస్తువులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి, ఇన్‌స్పెక్టర్ తులసీధర్ తదితరులు

కడియం: తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక సమీపాన జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అధికారులు మంగళవారం రూ.2,58,27,433.71 విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ వాహనాలను తనిఖీ చేస్తూండగా ఎటువంటి రవాణా అనుమతి పత్రాలూ లేకుండా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి లాజిస్టిక్స్ వాహనంలో తరలిస్తున్న మూడు బాక్సుల్లో వీటిని గుర్తించారు. 4,557.091 కేజీల బంగారం, 1.209 కేజీల వెండి వస్తువులు వీటిలో ఉన్నాయి. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, తహసీల్దార్ రమాదేవి, ఇతర శాఖల అధికారుల సమక్షంలో వివరాలు నమోదు చేసుకుని, సంబంధిత ఉన్నతాధికారులకు ఈ సొత్తును అందజేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో రూ.12.20 లక్షల పట్టివేత


సామర్లకోటలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో స్వాధీనం చేసుకున్న నగదు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల వద్ద రూ.50వేలు కంటే ఎక్కువ నగదు ఉంటే దానికి తగిన ఆధారాలు ఉండాలని అధికారులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకు వెళుతున్నారు. దీనిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ 5 స్థానిక మెహర్ కాంప్లెక్స్ వద్ద ఒక మోటారు సైకిలుపై వెళుతున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.12.20 లక్షల నగదు లభించింది. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.ప్రదీప్‌కుమార్ నగదు స్వాధీనం చేసుకొని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. అయితే స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న బార్‌కు చెందిన సొమ్ము బ్యాంకులో జమ చేయడానికి వెళుతున్నట్లు పంపన మురళీకృష్ణ తెలిపారు. అయితే దానికి సంబంధించిన ఆధారాలను చూపించలేకపోవడంతో నగదు సీజ్ చేసి కాకినాడ ట్రెజరీకి జమ చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.1.33 కోట్లు

రికార్డు స్థాయిలో 28 రోజుల ఆదాయం


సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా గత 28 రోజులకుగాను రికార్డు స్థాయిలో రూ.1,32,78,743 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను మంగళవారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.1,28,88,993 కాగా, చిల్లర నాణేలు రూ.3,89,750 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె. రామచంద్రమోహన్ తెలిపారు. వీటితోబాటు బంగారం 25 గ్రాములు, వెండి 1,180 గ్రాములు వచ్చిందని వారు తెలిపారు. 20 రోజులుగా రత్నగిరి పై జోరుగా వివాహాలు జరుగుతున్నాయి. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న వారు కూడా పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించారు. వారంతా పెద్ద మొత్తంలో హుండీలలో కానుకలు సమర్పించడంతో రికార్డు స్థాయిలో రోజుకు సరాసరి రూ.4,91,805 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. సత్యదేవుని హుండీల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీ కూడా లభించింది. అమెరికా డాలర్లు 122, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్‌లు 65, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీనార్లు 175, యూరోలు 35, ఆస్ట్రేలియా డాలర్లు పది, సౌదీ అరేబియా రియల్స్ ఐదు లభించాయి.

ఎన్నికల వేళ అక్రమ రవాణా

12 మంది అరెస్ట్... రూ.2.06 లక్షల నగదు సీజ్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎంత నిఘా పెడుతున్నా అక్రమ మార్కులు మద్యం, నగదు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ నిఘా బృందాలు దాడులు, తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నాయి. జిల్లాలో సోమ, మంగళవారాల్లో నిఘా బృందాలు నిర్వహించిన దాడులు, తనిఖీల్లో 12 మందిని అరెస్ట్ చేశారు. రూ.2.06 లక్షల నగదు సీజ్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- ఐ.పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 4 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 2.6 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు.
- ఈతకోట చెక్ పోస్టు వద్ద తనిఖీల్లో రూ.2.06 లక్షలు నగదు సీజ్ చేశారు.
- అమలాపురం, రాజోలు, ఆలమూరు, కొత్తపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం ఎస్ఈబీ స్టేషన్ల పరిధుల్లో దాడులు నిర్వహించి 11 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 127 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 32.73 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.
- పామర్రు పోలీసు స్టేషన్ పరిధిలో కూళ్ల, పాణింగపల్లి, తామరపల్లి, గంగవరం, ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, రాజవరం గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో కేంద్ర బలగాలు మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించాయి. స్వేచ్ఛా పోలింగ్ ఓటర్లకు పోలీస్ స్టేషన్ల అధికారులు భరోసా ఇచ్చారు.